## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అతి స్వల్ప కాలంలోనే అత్యధిక మంది పాఠకుల మన్ననలు పొందుతూ ముందుకు దూసుకెళ్తున్న క్విక్ టుడే దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

EDITOR: G.BUCHI REDDY
8125972476



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక



QUICK TODAY TV తెలుగు
8125972476



| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 246 | శనివారం | 13-06- 2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8 |
|---|---|---|---|---|---|---|
| MALKAJGIRI | Volume: 3 | Issue: 246 | Saturday | 13-06- 2026 | Price: ₹3/- | Pages: 8 |


# కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి

## రీజినల్ రింగ్ రోడ్డుకు అడ్డుపడింది ఆయనే

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
రీజినల్ రింగ్ రోడ్డును అడ్డుకున్నది ఆయనే
తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
కేటీఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు
మీనాక్షి సీట్ చోరీకి బీజేపీ కుట్ర రాజకీయాలు
శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ
తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు
మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్
ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ



**న్యూఢిల్లీ, జూన్12:** రాష్ట్రంలోని ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని, ఆయన పక్కా తెలంగాణ ద్రోహి అని మరోమారు సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ

మిగతా 2లో

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం

సీఎం రేవంత్ ప్రయాణిస్తున్న విమానం బెంగళూరుకు మళ్లింపు

2



## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

**న్యూఢిల్లీ, జూన్12:** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ

మిగతా 2లో



## సర్ ప్రక్రియ ఓ భూతం

చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3



## రేవంత్‌కే ఫ్యూచరే లేదు

### ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ?

మీనాక్షి వ్యవహారంపై సిట్ వేస్తారా?
ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి
మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం

మిగతా 2లో



## యథాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి
అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):** సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్

మిగతా 2లో



## ఏసీబీకి చిక్కిన ఎంపీడీవో, ఎంపీవో

లంచం తీసుకుంటుండగా పట్టివేత
పటాకులు కాల్చి సంబరం చేసుకున్న గ్రామస్తులు

**మహబూబాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):** భూమి లేఅవుట్ అభివృద్ధి పనులకు లంచం తీసుకున్న ముగ్గురిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సిములపేట మండలానికి చెందిన ఎంపీడీవో రాధిక, ఆమె కుమారుడు నాగార్జున, ఎంపీవో యాకయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని పద్మావ తిగూడెం గ్రామంలో లేఅవుట్‌కు సంబంధించిన భూమిని



మిగతా 2లో

# గుజరాత్ కంపెనీకి కాంట్రాక్టు..


# స్కూలు డ్రెస్సుల కుంభకోణం

కవిషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా
వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణ

**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):** స్కూల్ డ్రెస్సులను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సిఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కవిషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారని అన్నారు. బీఆరఎస్ హయాంలో గురుకులాలు,

మిగతా 2లో





## అసలైన టీఎంసీ మాదే

తిరుగుబాటు ఎంపీల కొత్త ఎత్తుగడ
స్పీకర్ ఓంబిర్లాను కలిసి వివరించేందుకు సన్నద్ధం

**న్యూఢిల్లీ, జూన్12:** తృణమూల్ కాంగ్రెస్ లో తలెత్తిన సంక్షోభం పతాక స్థాయికి చేరుతున్నాయి. తమదే అసలైన టిఎంసి అని తిరుగుబాటు దారులు ప్రకటించే సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ అధి నాయకత్వంపై అసంతృప్తితో రగులుతున్న తిరుగుబాటు ఎంపీలు తమదే

మిగతా 2లో




## స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన

సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
పోలవరం, అమరావతి, రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు

4

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత



క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం


3



## యూరియా కోసం రైతుల రాస్తారోకో

**కామారెడ్డి, జూన్12(క్విక్ టుడే న్ యూస్):** యూరియా కోసం బీర్కూర్ మండల కేంద్రంలో అన్నదాతలు రాస్తారోకో చేశారు. యూరియా బస్తాల కోసం వివిధ గ్రామాలకు చెందిన రైతులు యాప్‌లో

మిగతా 2లో



## సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

ప్రాజెక్టు ఎన్‌వోసీ కోసం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక చొరవ
అంతర్‌రాష్ట్ర సత్సంబంధాలతో ప్రాజెక్టు అనుమతులకు వేగం
సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
ముంపు ప్రభావిత భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం
4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు భారీ ఊతం
రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా అదనంగా 30 వేల ఎకరాలకు సాగునీరు
దేవాదుల ఆయకట్టు స్థిరీకరణతో పాటు వందల గ్రామాలకు తాగునీటి ప్రయోజనం
ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ
సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి

3

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

శనివారం 13 జూన్ 2026

quicktodaynews.com



తరువాయి పేజీ..



# రేవంత్‌కే ఫ్యూచరే లేదు

ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు.మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిం దన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరపున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల ప్రక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

## యథాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తు న్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## యూరియా కోసం రైతుల రాస్తారోకో

గురువారం సాయంత్రం బుక్ చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 7 గంటలకు బీర్కుర్‌లోని గ్రోమోర్ కేంద్రానికి రైతులు యూరియా కోసం వచ్చారు. 7 గంటల నుంచి 11 గంటల వరకు దుకాణం తెరవకుండా యూరియా ఇవ్వకపో వడంతో ఆగ్రహించిన రైతులు బీర్కూర్ పోతంగల్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. యూరియా ఇవ్వకుండా సిబ్బంది కాలయాపన చేస్తున్నారంటూ ఆరోపించారు. పోలీసుల జోక్యంతో రాస్తారోకో విరమించారు.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి

కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డు కుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టి నప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిం దన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాక రమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు



కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తి స్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు.

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడా రన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడి నందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆరఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం

### సీఎం రేవంత్ ప్రయాణిస్తున్న విమానం బెంగళూరుకు మళ్లింపు



**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):**

హైదరాబాద్‌లో భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఏర్పడ్డ ప్రతికూల వాతావ రణంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్న విమానాన్ని దారి మళ్లించారు. హైదరాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా దిల్లీ నుంచి శంషాబాద్ వస్తున్న విమానాన్ని బెంగళూరుకు డైవర్ట్ చేశారు. రేవంత్‌రెడ్డి సాయంత్రం 6.30 గంటలకు దిల్లీ నుంచి ఇండిగో విమానంలో బయలుదేరారు. హైదరాబాద్‌లో వర్షం కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. చందానగర్, మియాపూర్, జేఎన్టీయూ, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, సనత్‌నగర్, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, నాంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, నారాయణగూడ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలుచోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి.పలుచోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. వర్షానికి ప్రధాన రహదారిపైకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

## ఏసీబీకి చిక్కిన ఎంపీడీవో, ఎంపీవో

గ్రామ పంచాయతీ వద్ద తాకట్టు పెట్టేలా పంచాయతీ సచివాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాధితుడు ఎంపీడీవో రాధికను, ఎంపీవో యాకయ్యను సంప్రదించాడు. దీంతో వారు లంచం డిమాండ్ చేయడంతో శుక్రవారం ఎంపీడీవో కుమారుడు నాగార్జునకు మొత్తం 45 వేల రూపాయలు అందజేశాడు. దీంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కాగా ఎంపీడీవో రాధిక ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో స్థానికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

## అసలైన టీఎంసీ మాదే

'నిజమైన టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్ అని క్లెయిమ్ చేసుకునేందుకు సన్నద్ధమవు తున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకోనున్నారు. ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా ధృవీకరించారు. ఇప్పటికే తమ గ్రూపు స్పీకర్‌కు ఒక రిప్రజెంటేషన్ సమర్పించిందని, తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటు గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు ఈనెల 15న మరోసారి కలుసుకోనున్నామని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా తెలిపారు. ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపు ఏర్పాటుకు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు మద్దతించేందుకు రెబల్ ఎంపీలు పట్టుదలగా ఉండగా, వారికి మద్దతిస్తున్న వారిలో బసునియా ఉన్నారు. ఆయన కూచ్ బెహర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ ఎంపీలను ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ కీర్తి అజాద్ చేసిన ఆరోపణలను బసునియా తోసిపుచ్చారు. ఆయన అబద్ధలాకోరు అనీ, ఆ విధంగా చెప్పడం సరికాదని అన్నారు. తాము 19 మంది ఎంపీలమనీ, ఆయన కూడా ఒక ఎంపీయేనని, ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు. తిరుగుబాటు ఎంపీలకు కకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వం వహిస్తున్నారు. లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్టుగా ఆమె ఇటీవల ప్రకటించారు. ఈ గ్రూపులో శతాబ్ది రాయ్, యూసుఫ్ పఠాన్, సయోనీ ఘోష్, శత్రుఘ్నసిన్హా తదితర ఎంపీలు ఉన్నారు.



## గుజరాత్ కంపెనీకి కాంట్రాక్టు.. స్కూలు డ్రెస్సుల కుంభకోణం

ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని, 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ అందలేదన్నారు.

## రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

### విజేతల జాబితాలో ఖర్గే, తరుణ్ చుగ్



**న్యూఢిల్లీ, జూన్12:**

రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎసఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.



# చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

## వైద్యం ఖర్చులు భరిస్తామని హామీ

**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):**

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్`2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆరఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సవికరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ విడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆరఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆరఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

# ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

## క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం

**న్యూఢిల్లీ, జూన్12:**

దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమÖశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎసఎసఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మÖడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 విÖటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటన్నారు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

## షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):**



తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హావిÖ మంత్రి శ్రీధర్ బాబు హావిÖ ఇచ్చారు.

# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

## ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, జూన్12:**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆరఎసఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సవిÖపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యÖపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

**ప్రాజెక్టు ఎన్‌వోసీ కోసం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక చొరవ**

**అంతర్‌రాష్ట్ర సత్సంబంధాలతో ప్రాజెక్టు అనుమతులకు వేగం**

**సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం**

**ముంపు ప్రభావిత భూములకు చట్టబద్ధ పరిహారం చెల్లించేందుకు సిద్ధం**

**4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు భారీ ఊతం**

**రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా అదనంగా 30 వేల ఎకరాలకు సాగునీరు**

**దేవాదుల ఆయకట్టు స్థిరీకరణతో పాటు వందల గ్రామాలకు తాగునీటి ప్రయోజనం**

**ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ**

**సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి**



**హైదరాబాద్, జూన్12(క్విక్ టుడే న్యూస్):**

గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క?సారక్క బ్యారేజ్ / సమ్మక్క సాగర్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తో హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్?తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్క?సారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం, ఎనఓసీ జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమ్మక్క?సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని ఆయన వివరించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి గారు తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హావిÖ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం సమ్మక్క`సారక్క ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర జల సంఘంలోని అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. ఎనఓసీ లేకపోవడం వల్ల మాత్రమే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమ్మక్క,సారక్క ప్రాజెక్టు మÖలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయని మంత్రి వివరించారు. గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారఎస్పీ స్టేజ్?2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

**నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు**

**హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన**



**సిద్ధిపేట, జూన్12(క్విక్ టుడే న్యూస్):**

సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆరఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆరఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు విÖరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యÖనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆరఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. విÖరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# సర్ ప్రక్రియ ఓ భూతం లాంటిది

**చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం, జూన్12(క్విక్ టుడే న్యూస్):**



ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎసఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎసఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎలఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా విÖనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫఐఆర్ ఉందని అన్యాయంగా విÖనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు.

# గంజాయితో పట్టుబడ్డ మోడల్ మిస్ హర్ష సన్నీ

**బ్యాంకాక్ నుంచి ముంబై రాగా పట్టివేత**

**ముంబై,జూన12(ఆరఎనఎ):**



మోడలింగ్ రంగంలో రాణిస్తూ.. కేరళ అందాల పోటీల్లో పాల్గొన్న ఓ యువతి, ఒక్క రాత్రిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా మారి జైలుపాలైంది. బ్యాంకాక్ నుంచి ముంబైకి రూ.11.82 కోట్ల విలువైన హై`క్వాలిటీ 'హైడ్రోపోనిక్ గంజాయి'ని స్మగ్లింగ్ చేస్తూ.. మాజీ 'మిసెస్ కేరళ' కంటెస్టెంట్ హర్ష సన్నీ (28) ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఎయిర్ ఇండియా విమానం ద్వారా బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి హర్ష సన్నీ చేరుకుంది. లగేజీ క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్ యÖనిట్, కస్టమ్స్ అధికారులు గమనించారు. ఆమెను పక్కకు పిలిచి, ఆమె వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ప్యాక్ చేసిన 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం ఉంది. వెంటనే అధికారులు 'ఎన్‌డిపిఎస' కిట్‌తో కెమికల్ టెస్ట్ చేయగా, అది అత్యంత ఖరీదైన, నాణ్యమైన 'హైడ్రోపోనిక్ మారిజువానా' (గంజాయి) అని తేలింది. సాధారణ గంజాయితో పోలిస్తే ల్యాబ్‌లలో నియంత్రిత వాతావరణంలో పెంచే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి మార్కెట్లో విపరీతమైన డిమాండ్, ధర ఉంటుంది. హర్ష సన్నీ వద్ద దొరికిన 11 కిలోల గంజాయి విలువ అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో సుమారు రూ.11.82 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఆమెపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

# సంపాదకీయం

## తరగతి గదిలోనే .. దేశ భవిష్యత్‌కు పునాది!

విద్యా, వైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ది చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదరగొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్తోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్దం చేస్తే మంచిది. ఇందుకు తల్లిదదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన

**సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి**

**ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం**

**తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు**

**వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం**

**పోలవరం, అమరావతి, రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత**

**జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది**

**రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు**




**తిరుపతి, జూన్12(క్విక్ టుడే న్యూస్):** స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్టానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్టాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్టానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్టాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్టాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు.

# ప్రజా తీర్పుతోనే రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

**గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది**

**సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు**

**సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం**

**యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి**


**రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**తిరుపతి, జూన్12(క్విక్ టుడే న్యూస్):** ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్టాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

# హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

**పనివాళ్ల ఫిర్యాదుతో బయటపడ్డ వైనం**



**చండీఘడ్, జూన్12:** హనీట్రాప్ లో పడి.. ఓ మహిళా న్యాయమర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు విద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్‌కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

శనివారం జూన్ 13, 2026

quicktodaynews.com



## వేముల మైసయ్య -పార్వతమ్మ జ్ఞాపకార్థంగా కొడుకు అన్నదానం



**నార్కెట్ పల్లి, జూన్ 12(క్విక్ టుడే న్యూస్ ):**
వేముల వెంకన్న తన తల్లితండ్రుల జ్ఞాపకార్ధంగా ప్రేమతో బిక్షాటన చేసే వారికీ,నిరుపేదలకు, బాటసారులకు, నిస్సహాయులకు 100మందికి మనం స్వచ్ఛంద సంస్థ ద్వారా 590 రోజున అన్నదానం చేయడం జరిగింది.వేముల వెంకన్న మాట్లాడుతూ మా అమ్మ నాన్న లు ఎంతో కష్టపడి మమ్మల్ని ని ఇంత పెద్ద వాళ్ళని చేసింరు . మా అమ్మనాన్నలు మా మధ్య నుండి దూరం అయిన మా మదిలో ఎల్లకాలం ఉంటాడు, మా అమ్మ నాన్న నేర్పినవి కష్టపడి ఎదగడం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం, నిరుపేదల ఆకలి తీర్చటం.ఆలా ఉండానికి ప్రతి సంవత్సరం నిరుపేదలకు దానం చేయడం జరుగుతుంది. ఎప్పటికి ఇలాగే జరుపుతాం అని తెలియజేసారు, ఈ రోజు 100మంది ఆకలిలో రూపంలో ఇలా మా అమ్మ నాన్న కనిపించరు,తెలియజేయుటకు సంతోషిస్తున్నాం అని కుటుంబం సభ్యులు తెలిపారు, ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ పుల్లంల అచ్చులు,వేముల సత్తయ్య, బాణాల భాస్కర్ రెడ్డి,సట్టు సత్తయ్య,ప్రజ్ఞపురం సత్యనారాయణ, గాయం శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య రక్షణలో వైద్యుల పాత్ర కీలకం



**తొర్రూరు జూన్ 12(క్విక్ టుడే న్యూస్)**
ప్రజా ఆరోగ్య రక్షణలో వైద్యుల పాత్ర కీలకమని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు అన్నారు.తొర్రూరు ఏరియా ఆసుపత్రికి బదిలీపై వచ్చిన జనరల్ సర్జన్ డాక్టర్ అలువాల విజయ్ కుమార్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయనకు సహచర వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ సందర్భంగా సూపరిటెండెంట్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ ....**

వైద్యుల చేరిక పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తుందని తెలిపారు.
ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా వ్యవహరించి వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు.డాక్టర్ విజయ్ కుమార్ తొర్రూరు ప్రాంత ప్రజలకు సుపరిచితులని,వారి అనుభవం ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ గిరి ప్రసాద్,డాక్టర్ శంకర్,అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

**మహబూబాబాద్ జిల్లా రజక**

**వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య**




**తొర్రూరు జూన్ 12(క్విక్ టుడే న్యూస్)**
హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక కుటుంబాన్ని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు పరామర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య మాట్లాడుతూ...బాలికకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడిని వెంటనే రిమాండ్‌కు పంపించి,పోక్సో చట్టంతో పాటు హత్యాయత్నం/హత్య కేసులు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక భవిష్యత్ వైద్యం, పునరావాసం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు,సామాజిక సంస్థలు తమ మద్దతును కొనసాగిస్తాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన సహాయ సహకారాలు అందించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# పాలకుర్తిలోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలి: సీపీఎం

### పలు డిమాండ్లతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

**పాలకుర్తి, జూన్ 12 (క్విక్ టు డే న్యూస్):**
పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కమిటీ నాయకులు సోమ సత్యం, ఎదునూరి మధర్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పినప్పటికీ, పాలకుర్తి నియోజకవర్గానికి ఆ అవకాశం దక్కే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పాలకుర్తి చుట్టూ సుమారు 60 గ్రామాలు ఉండటంతో పాటు, భౌగోళికంగా మరియు రవాణా సౌకర్యాల పరంగా ఇది నియోజకవర్గ కేంద్రంగా ఉందని తెలిపారు. వేలాది మంది పేద, బహుజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇక్కడే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. మారుమూల ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం వల్ల నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ఆరోపించారు.తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాలకుర్తి ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్న నాయకులు, ఇక్కడి విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు ఇంటర్, డిగ్రీ కళాశాలలను కూడా పాలకుర్తిలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.పాలకుర్తి ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు భరించలేని పేద కుటుంబాలకు ప్రభుత్వ విద్యాసంస్థలే ఆశ్రయమని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాలకుర్తిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వేల్పుల కొమురయ్య, ఏనుగతల వెంకన్న, ఒగ్గుల కొమురయ్య, లకావత్ రాములు, సత్యనారాయణ, సురేష్, కుమార్, రామన్న, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.




## బాలవికాసతో తిరుమలగిరి

# ఆదర్శ గ్రామ నిర్మాణానికి శ్రీకారం

### గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు

### ప్రజల భాగస్వామ్యమే గ్రామాభివృద్ధికి బాట: ఈదురి వసంత





**తిరుమలగిరి, జూన్ 12 (క్విక్ టు డే న్యూస్ ):**
పాలకుర్తి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శుక్రవారం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో "ఆదర్శ గ్రామ నిర్మాణ" పథకంపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన ఈ సమావేశానికి సర్పంచ్ చెరిపెల్లి మమత అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బాలవికాస ఆదర్శ గ్రామ పంచాయతీల సీనియర్ కోఆర్డినేటర్ ఈదురి వసంత మాట్లాడుతూ గ్రామ ప్రజల సమన్వయం, భాగస్వామ్యంతో తిరుమలగిరిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాలవికాస సంస్థను కెనడా నివాసి బాల దేరిసా 1990లో స్థాపించారని, ప్రస్తుతం దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 7 వేల గ్రామాల్లో సంస్థ సేవలు అందిస్తోందని చెప్పారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి గ్రామం బాలవికాస సహకారంతో దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, చెరువుల పూడికతీత, వితంతు పెన్షన్లు, ఆరోగ్యం, విద్య వంటి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రజల భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.అనంతరం గ్రామాభివృద్ధికి సంబంధించి పర్యావరణం, మంచినీటి సరఫరా, ఆరోగ్యం, మహిళా సంఘాల నిర్వహణ, విద్య, డిజిటల్ అవగాహన, పంచాయతీ అభివృద్ధి తదితర ఎనిమిది విభాగాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. అలాగే అన్ని కమిటీల సమన్వయంతో గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా కూటికంటి రాజు, ఉపాధ్యక్షుడిగా కె. కరుణాకర్, కార్యదర్శిగా ఉప్పునూతుల రేణుకను ఎన్నుకున్నారు.ప్రతి నెల కమిటీలు సమావేశమై గ్రామాభివృద్ధిపై చర్చించి నివేదికలు సమర్పిస్తే, బాలవికాస సంస్థ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వసంత తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు రాజకుమార్, వినయ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ పొన్నం రాజు, మహిళా సంఘాల నాయకులు, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చాక్‌పీస్ పట్టి ఉపాధ్యాయుడిగా మారిన డీసీపీ రాజమహేంద్ర నాయక్



**జనగామ, జూన్ 12 (క్విక్ టుడే న్యూస్):**
జనగామ పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఉపాధ్యాయుడిగా చాక్‌పీస్ చేతబట్టి బోర్డుపై రోడ్ సేఫ్టీ అంశాలను రాస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, తమ తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇంట్లో గుర్తు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నారులు కూడా ఈ విషయంలో అవగాహన పెంచుకుని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి బాగా చదువుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని వారి విద్యాభివృద్ధికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు సాంబమూర్తి శర్మ (అయ్యగారు), శివాజీ ఫౌండేషన్ సభ్యులు ప్రభాకర్, సిరిపురం వినయ్, మామిడాల భరత్,హర్షిత్, శీలం గణేష్,వినీత్, సాయి తేజ, ములుగు ఆకర్ష, పంతం సాయి ప్రసాద్,సందీప్, వినీత్, దిలీప్, కిరణ్, శ్రీకాంత్ భక్తులు పాల్గొన్నారు.







RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే QUICK TODAY

శనివారం జూన్ 13, 2026 quicktodaynews.com



## పర్శినేని వెంకటేశ్వరుకు (టావు )

## ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు..

ఆయురారోగ్యాలు, విజయాలతో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష..

స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనమంటూ లుంజల శేఖర్ అభినందనలు..




**మార్కాపురం జిల్లా బ్యూరో, జూన్ 12,**

మార్కాపురం, ఈ రోజు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న పర్శినేని వెంకటేశ్వరుకు స్నేహితులు, అభిమానులు, ఆత్మీయుల నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా సన్నిహిత మిత్రుడు లుంజల శేఖర్ ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పర్శినేని వెంకటేశ్వరు స్నేహానికి, ఆప్యాయతకు, మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచారని లుంజల శేఖర్ పేర్కొన్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో పలకరిస్తూ, అందరినీ కలుపుకుని వెళ్లే వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. స్నేహితుల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. జన్మదినం సందర్భంగా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలు సమృద్ధిగా కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాల మధ్య ఆనందంగా జీవిస్తూ, ప్రతి రంగంలో విజయాలు సాధించాలని కోరుకున్నారు. సమాజంలో మరింత గుర్తింపు పొందుతూ, ఆశయాలను సాకారం చేసుకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. జీవితంలో ప్రతి అడుగు విజయవంతం కావాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు ఆయనను వరించాలని అభినందించారు. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పర్శినేని వెంకటేశ్వరుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆనందం, ఆరోగ్యం, అభివృద్ధి కోసం ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు.

## వెలిగొండ నిర్వాసితులకు శుభవార్త?

పరిహారం, పునరావాస చర్యలకు

రూ.906 కోట్లు అదనంగా కేటాయింపు.



**యర్రగొండపాలెం జూన్ 12,**

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి శుభవార్త అందించింది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులు, పునరావాస కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో అదనంగా రూ.906 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ప్రభావితమైన కుటుంబాల పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. గతంలో గుర్తించిన 7,321 నిర్వాసిత కుటుంబాల్లో ఇప్పటికే 7,225 కుటుంబాలకు పునరావాస ప్యాకేజీలు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన కుటుంబాలకు కూడా త్వరితగతిన పరిహారం అందించి పునరావాస ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదనంగా విడుదల చేసిన నిధులను పునరావాస కాలనీలలో రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించనున్నారు. దీంతో నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు అవకాశం ఏర్పడనుంది.ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పునరావాస సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, మిగిలిన కుటుంబాలకు కూడా న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి..

### శ్రీనివాసరెడ్డి,శాంతకుమార్..

**మార్కాపురం జిల్లా జూన్ 12 ,**

ప్రభుత్వము విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు,యూనిఫాంలు తదితర విద్యా సామగ్రి కిట్లను పట్టణంలోని ఏకలవ్య నగర్ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులకు శుక్రవారం న పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్తల శ్రీనివాస రెడ్డి, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ మాలపోలు శాంత కుమార్ విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, విద్యార్థులు అందిన పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల పునఃప్రారంభమైన తొలి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాలు,యూనిఫాంలు పంపిణీ చేయడం వల్ల విద్యా కార్యక్రమాలు సజావుగా ప్రారంభమయ్యాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు..

# రోగులకు అందుతున్న ఆహారంపై తీవ్ర విమర్శలు..

### గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యతపై ప్రశ్నలు..

### ఫిర్యాదులు వస్తున్నా మారని పరిస్థితి..

**మార్కాపురం జిల్లా , జూన్ 12,**

మార్కాపురం జిల్లా, గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ప్రతిరోజు అందిస్తున్న ఆహార నాణ్యతపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన రోగులకు పౌష్టికాహారం అందించాల్సిన చోట నాణ్యతలేని ఆహారం వడ్డిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న భోజనం నాణ్యతపై గతంలోనూ పలుమార్లు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. రోగుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదని తెలుస్తోంది. ఆహార సరఫరా బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీ ప్రతినిధులు ప్రత్యక్ష పర్యవేక్షణకు దూరంగా ఉండటంతో సమస్యలు మరింత పెరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా నియమించిన వ్యక్తుల ద్వారా నిర్వహణ సాగుతుండటంతో నాణ్యత నియంత్రణ లోపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అన్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం అత్యంత అవసరం. అయితే ప్రస్తుతం అందుతున్న భోజనం రుచికరంగా లేదని, నాణ్యత కూడా ఆశించిన స్థాయిలో లేదని రోగులు చెబుతున్నారు. కొందరు రోగుల కుటుంబ సభ్యులు బయట నుంచి ఆహారం తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో రోగుల సంక్షేమం కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలులో లోపాలు కనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. రోగుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అభిప్రాయపడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆసుపత్రిలో అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కాంట్రాక్టర్ పనితీరును సమీక్షించి, రోగులకు నాణ్యమైన ఆహారం అందేలా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అనుమానం పెనుభూతమై ప్రాణం తీసింది..

### భార్య హత్య కేసులో నిందితుడు అరెస్ట్..

### 48 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు..

### హత్యకు ఉపయోగించిన గొడ్డలి, రక్తపు దుస్తులు స్వాధీనం..

**మార్కాపురం జిల్లా జూన్ 12,**

మార్కాపురం జిల్లా, కొమరోలు మండలంలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. భార్యను దారుణంగా హత్య చేసి పరారైన నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు, హత్యకు ఉపయోగించిన ఆయుధం, ఘటన సమయంలో ధరించిన రక్తపు మరకల దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. కొమరోలు పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితుడు పంధీటి దావీదును అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ కలహాలు, అనుమానాల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల దర్యాప్తు ప్రకారం, గిద్దలూరు మండలంలోని ఏబీఎం పాలెంకు చెందిన దావీదు తన భార్య మరియ జ్యోతిపై చాలా కాలంగా అనుమానం పెంచుకున్నాడు. ఈ కారణంగా ఆమెను తరచూ వేధింపులకు గురిచేసేవాడని విచారణలో తేలింది. కుటుంబంలో పెరుగుతున్న విభేదాల కారణంగా మరియ జ్యోతి సుమారు మూడు సంవత్సరాల క్రితం తన పిల్లలతో కలిసి కొమరోలు మండలం సర్వేరెడ్డిపల్లి గ్రామంలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి నివాసం ఉంటోంది. అయితే అనుమానాన్ని వీడని దావీదు ఈ నెల 10వ తేదీ ఉదయం సర్వేరెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నాడు. తన వెంట తీసుకువచ్చిన గొడ్డలితో మరియ జ్యోతిపై దాడికి దిగాడు.ప్రమాదాన్ని గుర్తించిన ఆమె చెల్లెలు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ నిందితుడు వెనక్కి తగ్గలేదు.మరియ జ్యోతిని వెంబడించి విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. నేరానికి ఉపయోగించిన గొడ్డలి, రక్తపు మరకలు ఉన్న దుస్తులను తాతిరెడ్డిపల్లి సమీపంలోని పొదల్లో దాచిపెట్టి తప్పించుకునే ప్రయత్నం చేశాడు.ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నిందితుడి కదలికలపై నిఘా పెట్టి, వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు చివరకు నిందితుడి ఆచూకీ గుర్తించారు.ఈ నెల 12వ తేదీ ఉదయం కొమరోలు మండలం తాటిచెర్ల మోటు జంక్షన్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ చేపట్టగా, అతడు నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. నిందితుడు చూపిన ప్రదేశానికి వెళ్లిన పోలీసులు హత్యకు ఉపయోగించిన గొడ్డలిని, రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.కుటుంబ వివాదాలు, అనుమానాలు ఎంతటి విషాదాలకు దారితీస్తాయో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల వద్ద ఆశ్రయం పొందిన మహిళ చివరకు భర్త చేతిలోనే ప్రాణాలు కోల్పోవడం గ్రామస్తులను కలిచివేసింది.హత్య జరిగిన కేవలం 48 గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు పోలీసు సిబ్బంది పనితీరును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు. వేగవంతమైన దర్యాప్తుతో కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.ప్రస్తుతం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



### రెండేళ్ల వెన్నుపోటు పాలనపై

# మార్కాపురంలో వైఎస్సార్సీపీ గర్జన..

### అన్నా రాంబాబు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ..

### జీవీ చెట్టు నుంచి గడియార స్తంభం వరకు కదం తొక్కిన వేలాది మంది..


### హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం..

**మార్కాపురం జిల్లా , జూన్ 12,**

మార్కాపురం జిల్లా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో ప్రజలకు చేసిన మోసాలను ఎండగట్టేందుకు వైఎస్సార్సీపీ చేపట్టిన “వెన్నుపోటు దినం” కార్యక్రమానికి మార్కాపురంలో విశేష స్పందన లభించింది. నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు. పట్టణ ప్రధాన వీధులు నినాదాలతో మార్మోగిపోయాయి. పట్టణంలోని జీవీ చెట్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు నివాళు లర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. రథం రోడ్డు, అమ్మవారశాల వీధి, పాత బస్టాండ్ ప్రాంతం, గడియార స్తంభం మీదుగా సాగిన ఈ ర్యాలీ ప్రజల దృష్టిని ఆకర్షించింది. మార్గమధ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీకి సంఘీభావం ప్రకటించారు. పలుచోట్ల మహిళలు, వ్యాపారులు, స్థానికులు నాయకులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఆకాశానికెత్తిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా మరచిపోయిందని మండిపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేస్తూ సాగుతున్న ఈ పాలన రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ వెన్నుపోటుగా నిలిచిపోతుందని విమర్శించారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, రెండేళ్లలో ఒక్క వర్గానికైనా పూర్తి స్థాయిలో న్యాయం చేసిందా అని ప్రశ్నించారు. మహిళలకు ప్రత్యేక పథకాలు, యువతకు ఉద్యోగాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, నిరుద్యోగులకు భరోసా, వృద్ధులకు రక్షణ కల్పిస్తామని చెప్పిన మాటలు ఎక్కడ అమలయ్యాయని నిలదీశారు. మహిళల పేరుతో ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ వాటి అమలుపై ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత రోజురోజుకు క్షీణిస్తోందని, నేరాలు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. మహిళలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. సాగు ఖర్చులు పెరిగినా రైతు ఆదాయం పెరగలేదని, పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని పేర్కొన్నారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడిన ప్రభుత్వం రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. యువతకు ఉద్యోగాల పేరుతో హామీలు ఇచ్చిన ప్రభుత్వం నిరుద్యోగులను నిరాశపరిచిందన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక, ఉపాధి అవకాశాలు లేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అనేక పథకాలు నిలిచిపోయాయని, పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. రెండేళ్ల పాలనలో ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పు ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇప్పుడు నిజాలను గుర్తిస్తున్నారని, ఎన్నికల ముందు చెప్పిన మాటలు, ఎన్నికల తర్వాత చేసిన పనులను పోల్చి చూస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని, ప్రతి వర్గం మోసపోయిన భావనతో ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. హామీల అమలు కోసం, ప్రజల హక్కుల కోసం ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ నిలదీస్తామని చెప్పారు. ర్యాలీ ముగింపు సందర్భంగా కార్యకర్తలు భారీగా నినాదాలు చేస్తూ కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రజలను మోసం చేసిన పాలనకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. మార్కాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.







## మా ఇంటి బంగారం
### సమంత కోసం వెయిటింగ్

మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని య□ఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.




## కిరణ్ అబ్బవరం కేఏ 13
### సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

## పూరీ మార్క్...
## స్లమ్ డాగ్ టీజర్

డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్`ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ `33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయ నిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ సె్టల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.



## నానీ మూవీలో రుక్మిణీ వసంత్

సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక', ఎన్టీఆర్ 'డ్రాగన' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలి స్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.



**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com